క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: కేఎల్‌యూ రోడ్డులోని విద్యుత్ లైన్ల మార్పిడి నిమిత్తం శుక్రవారం సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కల సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. వడ్డేశ్వరం, ఇప్పటం, మెల్లెంపూడి గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు మేరిమాత మందిర వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలంలోని గుంటూరు- నరసరావుపేట రాష్ట్ర రహదారిపై మేరికపూడి గ్రామ శివారులోని మేరిమాత మందిర వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు మందిర నిర్వాహకులు గురువారం తెలిపారు. ఉదయాన్నే ఫిరంగిపురం బాల ఏసుదేవాలయ విచారణ గురువులు పి.బాలస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక దివ్య పూజా బలి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి విచారణ గురువులు జి.జోసఫ్, కె.మెల్కియా, పి.చిన్నప్ప, ఎం.క్రాంతికుమార్, పి.వినోద్, ప్రభుకుమార్ పాల్గొంటారని చెప్పారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు వివరించారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ స్వాతి శ్రీనాథ్ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధులను ముందస్తుగా గుర్తించడంతో పాటు నివారించడం ప్రాముఖ్యమని అన్నారు. మహిళల ఆరోగ్యం మరియు క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కేఎల్ మహిళా అభివృద్ధి సెల్ కోఆర్డినేటర్లు డాక్టర్ రూతు రమ్య, ఎస్.శ్రీలక్ష్మి, యూత్ రెడ్‌క్రాస్ ప్రొఫెసర్ ఇన్‌ఛార్జి డాక్టర్ కటారి సుకీర్తి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సహాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడికి చెందిన మన్నవ దుర్గ అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అందించిన రూ.10 వేల ఆర్థిక సాయాన్ని గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ జానీబాషా అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వాసిరెడ్డి కుశల ప్రసాద్, కర్రి సుధాకర్, పోపూరి హృదయరాజు, చిట్టిబొమ్మ నరేంద్ర పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు రూ.6.39 లక్షల జరిమానా



మంగళగిరి: నగర పరిధిలోని పలు ప్రాంతాలలో నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ అధిక లోడు వినియోగిస్తున్న వినియోగదారులకు జరిమానా విధించినట్లు అమరావతి సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ డాక్టర్ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ తెలిపారు. నగరంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ నిఘా విభాగం ఆధ్వర్యంలో 3,256 సర్వీసులను తనిఖీ చేసినట్లు చెప్పారు. వారిలో మాల్ ప్రాక్టీస్ పాల్పడిన వారితో పాటు అనుమతి పొందిన లోడు కంటే అధికంగా లోడు వినియోగించుకుంటున్న గృహ, వాణిజ్య, పారిశ్రామిక సర్వీసులలో 111 మంది వినియోగదారులను గుర్తించి వీరి నుంచి రూ.6,39,700 జరిమానా వసూలు చేయాలని నిర్ణయించి నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. తనిఖీలలో డీపీఈ ఈఈ కేవీఎల్ఎస్ మూర్తి, డీఈఈ అక్కల సత్యనారాయణ, డీఈఈ కేవీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక విద్యార్థుల ఎంపిక

తెనాలి టౌన్: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు రూరల్ మండలం కొలకలూరులోని జూబ్లీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ లీమా గురువారం తెలిపారు. గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో జూబ్లీ స్కూల్‌కు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు పాల్గొన్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థి వి.వినయ్‌కుమార్ బంగారు, కోట అఖిల్ వెండి పతకాన్ని సాధించినట్లు స్కూల్ ఫిజికల్ డైరెక్టర్లు రవికుమార్, ఆదిత్య తెలిపారు. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు.

ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని కల్పించాలి

ప్రత్తిపాడు: జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని కల్పించే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.యుగంధర్ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.4.48 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులపై బహిరంగ ప్రజావేదిక నిర్వహించారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం

- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు.
- రామచంద్రాపురంలో వైద్యశిబిరం
- హాజరైన కార్పొరేషన్ కమిషనర్ శారదాదేవి



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్సీహనుమంతరావు

మంగళగిరి: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రజల ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, కమిషనర్ యు శారదాదేవి అన్నారు. మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని రామచంద్రాపురం వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం గురువారం నిర్వహించారు. రామచంద్రాపురంతో పాటు నూతక్కి, చిర్రావూరు నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. షుగర్, బీపీ, ఈసీజీలతో పాటు అనేక పరీక్షలు నిర్వహించిన వైద్యులు వారికి మందులు అందజేశారు. ఎమ్మెల్సీ హనుమంతరావు మాట్లాడుతూ నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. విద్య వైద్యరంగాలపై కోట్లు ఖర్చు చేసి నాడు- నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలలతో పాటు హెల్త్ సెంటర్‌లను కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తీర్చిదిద్దారన్నారు. పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఏర్పాటు చేసి అవసరమైన మేర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడమే కాక అత్యవసరమైతే రోగులను వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఉన్న ఆస్పత్రులలో చేర్చి ఉచిత వైద్యాన్ని అందించేలా కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలతో పుట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నగర అడిషనల్ కమిషనర్ హేమామాలిని, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరాజు, డీఎంఓ రత్నమోహన్, వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల డాక్టర్లు కిరణ్‌కుమార్, అనూష, ప్రఫుల్లా, ప్రియాంక, మొబీనా పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: జగనన్న ఆరోగ్య సురక్షతో సామాన్యుడికి కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందని దుగ్గిరాల ఎంపీపీ డి.సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు డి.అరుణ అన్నారు. గురువారం మండల పరిధిలోని చింతలపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం చేసేందుకు డాక్టర్లు ఉండేవారు కాదని, ఇప్పుడు నాడు నేడు కింద వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆస్పత్రుల రూపురేఖలు మార్చి, వైద్య పరికరాలు ఏర్పాటు చేసి, ప్రతి వైద్యశాలకు ఇద్దరు డాక్టర్లను నియమించి కార్పొరేట్ వైద్యాన్ని అందజేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి, ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీ, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ రజనీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు వి.రజనీ కాంత్, మండల అధ్యక్షుడు ఎస్.రత్నం, వైద్యులు ప్రభాకర్ శివ, ఎండీ అబ్దుల్ రహమాన్, కె.తాజుద్దీన్, సుకన్య, వీవీ కర్ల పాల్గొన్నారు.



వైద్యసేవలను పరిశీలిస్తున్న ఎంపీపీ సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ

ఫిరంగిపురంలో...

ఫిరంపురం: ప్రజల ఆరోగ్యానికి పూర్తి భరోసా జగనన్న ఆరోగ్య సురక్ష అని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండలంలోని మేరిక పూడి గ్రామంలో నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలాన గ్రీస్ హాజరై పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కె.పద్మావతి, ఉపసర్పంచి పి.మల్లేశ్వరి, పి.వెంకట్రామిరెడ్డి, కె.బ్రహ్మారెడ్డి, చిట్టా అంజిరెడ్డి, తహసీల్దార్ పద్మనాభుడు, ఎంపీడీఓ డి.అనూరాధ, ఈఓపీఆర్డీ నిర్మల లక్ష్మీకుమారి, కార్యదర్శి కె.విష్ణువర్ధన్‌రావు, సీహెచ్ఓ వెంకట లక్ష్మి పాల్గొన్నారు.



రామచంద్రాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వృద్ధుడికి ఈసీజీ తీస్తున్న వైద్యులు



వృద్ధులకు కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు



షుగర్ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా..

కత్తెర సురేష్ కుమార్, బత్తుల బ్రహ్మానందరెడ్డి



వెలగపూడిలో వైద్య శిబిరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి

కంతేరు(తాడికొండ): ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. తాడికొండ మండలం కంతేరు, తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను గురువారం సందర్శించారు. వారు మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో ప్రభుత్వాస్పత్రులు నామమాత్రపు వసతులతో అరకొర సేవలందించేవని, కానీ జగనన్న అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో వైద్య ఆరోగ్య శాఖలో సమూల మార్పులు తీసుకొచ్చి విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రతి సచివాలయంలో నిర్మించి పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో కంతేరు సర్పంచి బెజ్జం మహేష్ బాబు, మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్, డెప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో సాధారణ పరీక్షల నిమిత్తం వచ్చిన పాస్టర్‌కు ఈసీజీ తీయగా లోపం ఉన్నట్లు గుర్తించిన వైద్యాధికారి దుర్గాప్రసాద్ మెరుగైన పరీక్షల నిమిత్తం ఆరోగ్యశ్రీ సంబంధిత గుండె వైద్యం అందుబాటులో ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి రిఫర్ చేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

ఎమ్మెల్యే ఆర్కే చొరవతో విద్యుత్ కష్టాలకు చెక్

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తడంతో ఎమ్మెల్యే ఆర్కే పర్యటించిన సందర్భంగా స్థానికులు, రైతులు విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి రూ.కోటి 20 లక్షల వ్యయంతో సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం ఏర్పాటు చేశారు. దుగ్గిరాల, మంచికలపూడి, తుమ్మపూడి, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ లో ఓల్టేజ్ సమస్య కారణంగా తరచూ ఇళ్లతో పాటు రైతులకు ఇబ్బంది ఏర్పడేది. ఈ సమస్యను తీర్చేందుకు దుగ్గిరాల సబ్‌స్టేషన్‌లో గతంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను అదనంగా 5 ఎంవీఏ(మెగావోల్ట్ యాంపియర్)ను ఏర్పాటు చేశారు. దీంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభించిందని గ్రామస్తులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

భట్టిప్రోలు: బైక్‌పై వెళుతున్న ఓ యువకుడు ప్రమాదవశాత్తూ విద్యుత్ స్తంభానికి ఢీకొని మృతి చెందిన సంఘటన ఇది. భట్టిప్రోలు పోలీసుల కథనం ప్రకారం రేపల్లెని ఓ రెస్టారెంట్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్న తాళ్లూరి అరుణ్ (29) తన బాబాయి ఉంటున్న తెనాలికి బుధవారం రాత్రి బైక్‌పై బయలు దేరాడు. భట్టిప్రోలు మండలం గొరిగ పూడి దాటగానే బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. తీవ్ర గాయాలతో ఉన్న అరుణ్‌ను గుర్తించి అటుగా వెళుతున్న ఓ లారీ డ్రైవర్ ఒంటిగంట సమయంలో 108కు కాల్ చేసి సమాచారం అందించారు. సమాచారం మేరకు అతడిని తెనాలి ఏరియా వైద్యశాలకు తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఇతడు సంగారెడ్డి జిల్లా కోంపల్లి గ్రామం సాయిబాబానగర్‌కు చెందిన వాసి అని, అవివాహితుడని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ తెలిపారు.

అంగలకుదురుకు ఐఎస్ఓ సర్టిఫికేషన్

తెనాలి రూరల్: మండలంలోని అంగలకుదురు ప్రతిష్టాత్మక ఐఎస్ఓ 9000:2001 సర్టిఫికేషన్‌కు ఎంపికైంది. తనిఖీలో భాగంగా కేరళ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్(కిలా) నుంచి అధికారుల బృందం గురువారం గ్రామాన్ని పరిశీలించింది. ఐఏఎస్ అధికారిణి భీతు బాలకృష్ణన్ నేతృత్వం వహించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, అభివృద్ధి పనులతో పాటు పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. పరిపాలనపై సంతృప్తి వ్యక్తం చేశారు. మరో రెండు ఆడిట్ బృందాలు త్వరలో గ్రామాన్ని సందర్శించి పరిశీలిస్తాయని, అనంతరం పలు తనిఖీల ఆధారంగా సర్టిఫికేషన్ మంజూరవుతుందని భీతు బాలకృష్ణన్ తెలిపారు.

15 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

తెనాలి: దసరా పర్వదినం సందర్భంగా పట్టణంలోని బోసు రోడ్డులో ప్రసిద్ధి చెందిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఈనెల 15నుంచి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 23వరకు జరిగే ఉత్సవాల బ్రోచర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఉత్సవాల వివరాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు, కార్యదర్శి బూర్లె నరసింహారావు, కార్యవర్గ సభ్యులు వుప్పల వరదరాజులు, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ప్రతిరోజూ శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు, శ్రీరాజరాజేశ్వరీదేవి ప్రత్యేక అలంకారాలతో భక్తులకు కనువిందు చేయనున్నట్టు నరసింహారావు చెప్పారు. నవచండీ పారాయణ-హోమం ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు ఆలయంలోని విజయగణపతి, రాహుకేతువులు, నవగ్రహాలు, శ్రీవింధ్యవాసినీ సమేత నగరేశ్వరస్వామి, శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి అభిషేకాలు, పూజలు, హోమాలు జరుగుతాయని చెప్పారు. ప్రతిరోజూ జరిగే పూజల వివరాల్ని రామకోటేశ్వరశర్మ తెలిపారు.

జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల్లో సత్తా

తాడేపల్లిరూరల్: కృష్ణ, గుంటూరు జిల్లాల స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీలలో ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లికి చెందిన బజరంగ్ స్పోర్ట్స్ అండ్ ఫిట్‌నెస్ అకాడమీకి చెందిన క్రీడాకారులు పలు విభాగాల్లో సత్తా చాటారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో అకాడమీ కార్యదర్శి, కోచ్ విష్ణుమొలకల సంఘవి మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన గుంటూరు జిల్లా గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ 14,17 బాక్సింగ్ పోటీలలో నలుగురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. సెప్టెంబర్ 29న కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో నిర్వహించిన అండర్-19 బాక్సింగ్ పోటీలలో నలుగురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అండర్- 19 బాలుర విభాగంలో (60 కేజీలు) మట్టపర్తి వివేక్, 52 కేజీల విభాగంలో ఎస్.కె. దావూద్ సనావుల్లా, 69 కేజీల విభాగంలో మహమ్మద్ నూరి రిహన్ శ్రీ, 66 కేజీల విభాగంలో చిటికరెడ్డి హేమంత్ ఎంపికయ్యారని, అదే విధంగా అండర్- 14 బాలుర విభాగంలో (42 కేజీలు) దొంత శశాంక్ పవన్‌కుమార్, అండర్- 17 బాలికల విభాగంలో (42 కేజీలు) పట్టేడి దోన శ్రీలక్ష్మి, 60 కేజీల విభాగంలో మహమ్మద్ అప్రవున్నీసా, 63 కేజీల విభాగంలో పెదపాటి బేబి భవ్యశ్రీ ఎంపికయ్యారని తెలిపారు.



రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

చుక్కపల్లివారి పాలెంలో పాఠశాల ప్రారంభం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చుక్కపల్లివారిపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను సర్పంచి దాసరి సుందరమ్మ గురువారం ప్రారంభించారు. ఎంపీపీ డి.సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు డి.అరుణ హాజరై మాట్లాడుతూ గతంలో షాల్మేష్ ఆర్మీ ఎయిడెడ్ పాఠశాల ఉండేదని దానిని మూసివేశారని, విద్యార్థుల ఇబ్బందులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి ఏర్పాటుకు కృషి చేసినట్లు చెప్పారు. గతంలో ఉన్న షాల్మేష్ ఆర్మీ ఎయిడెడ్ పాఠశాల భవనానికి మరమ్మతులు చేయించి 1వ తరగతి నుండి ఐదో తరగతి వరకు పాఠశాలను పునః ప్రారంభించినట్లు చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం ఒక టీచర్‌ను కేటాయించిందని, త్వరలోనే మరో టీచర్‌ను కేటాయించనున్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేశ్వరి, ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి, ఎంఈఓలు శ్రీనివాసరావు, లక్ష్మణరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, దుగ్గిరాల వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు ఎస్.రత్నం, రజనీకాంత్, డి.వెంకటేశ్వరరావు, డి.వీరయ్య, డి.రమేష్, ఆశీర్వాదం పాల్గొన్నారు.



పాఠశాలను ప్రారంభిస్తున్న సర్పంచి సుందరమ్మ, పక్కన ఎంపీపీ సంతోషరూపవాణి

పొలాల్లో ఏటా భూసార పరీక్షలు చేయించాలి

లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త గంగాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త గంగాదేవి

తెనాలి టౌన్: రైతులు పొలాల్లో ప్రతి ఏటా భూసార పరీక్షలు చేయించాలని, ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వాడాలాని లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త గంగాదేవి సూచించారు. రూరల్ మండలం నందివెలుగు సచివాలయ ఆవరణలో గురువారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ), వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా కేంద్రీయ విద్యాలయ పాఠశాల విద్యార్థుల ద్వారా సేకరించిన మట్టి నమూనా పరీక్షల సేకరణలో భాగంగా రైతు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను పంపిణీ చేసి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆత్మ ప్రాజెక్టు ఉప వ్యవసాయ సంచాలకులు పి.రామాంజనేయులు అధ్యక్షత వహించారు. సదస్సులో శాస్త్రవేత్త గంగాదేవి మాట్లాడుతూ దుక్కిలో సూపర్ ఫాస్ఫేట్ వేయాలని రైతులకు సూచించారు. కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించాలని తెలిపారు. వ్యవసాయశాఖ కార్యాలయ జాయింట్ డైరెక్టర్ పద్మజ మాట్లాడుతూ భూమి ఆరోగ్యంగా ఉండే విధంగా చూడాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పొలాల్లో 35శాతం జింక్ లోపం ఉన్న భూముల్ని గుర్తించామన్నారు. రెండు పంటల్లో ఒకసారి 20 కిలోల జింక్ వేయడంతో పాటు సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. బీడీఏ రత్నమంజుల మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల్లో 10 కేంద్రీయ విద్యాలయాలు, 10 నవోదయ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులు మట్టి పరీక్షలు నమూనాలు సేకరిస్తున్నారని తెలిపారు. వాటికి ల్యాబ్‌లో పరీక్షలు చేసి రైతులకు ఎరువులు వాడే వాడకం గురించి తెలియజేస్తారని చెప్పారు. తెనాలి కేంద్రీయ విద్యాలయం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైందని తెలిపారు. అధ్యక్షత వహించిన రామాంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు తెనాలి మండలం నందివెలుగు, గుడివాడ గ్రామాల్లోని రైతుల పొలాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులతో కలసి 52 మట్టి నమూనాల యాప్ ద్వారా సేకరించారని తెలిపారు. సాయిల్ టెస్టింగ్ కిట్ (మినీ ల్యాబ్) ద్వారా విద్యార్థులే స్వయంగా వాటిని విశ్లేషించినట్లు చెప్పారు. సదస్సు ద్వారా రైతులను నేరుగా కలుసుకుని వారికి తాము తయారు చేసిన నమూనాల ఫలితాలను అధికారులతో కలసి రైతులకు అందజేశారు. గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్ మాట్లాడుతూ అధికారుల సిఫారసు మేరకు ఎరువులు వాడినట్లయితే పొలాలు బాగుంటాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు శివగగన్, యసశ్వీలు తమ అనుభవాలు, పొలాల్లో తాము నేర్చుకున్న విషయాలను రైతులతో పంచుకున్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ వేసవిలో పొలాల్లో పచ్చిరొట్ట పైరులు పెంచి, కలియదున్నాలని సూచించారు. రైతులకు సర్పంచ్ పవన్‌కుమార్, శాస్త్రవేత్త గంగాదేవి, జాయింట్ డైరెక్టర్ పద్మజ సాయిల్ టెస్టింగ్ కార్డులను అందజేశారు. సదస్సులో ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి, తెనాలి ఏడీఏ ఎస్.ఉషారాణి, ఏవో జి.ప్రేమ్ సాగర్, కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, రామిరెడ్డి, డీఆర్‌సీ రాజవంశీ, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ ఏఈవో సౌజన్య, ఏఈవో మోహన్, వీఏఏ మౌనిక, పంచాయతీ కార్యదర్శి జి.సుభాష్ చంద్రబోస్, కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి ఈయూ కృషి

తెనాలి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) ఎంతో కృషి చేస్తోందని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు. తెనాలి ఆర్టీసీ డిపోలో గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పలు సంఘాల నుంచి ఎంప్లాయీస్ యూనియన్‌లో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ జెఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఆర్టీసీ ఏండీ ద్వారక తిరుమలరావు సహకారంతో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం డిపో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.బాబు, కార్యదర్శిగా ఎం.సుధాకరరావు, గౌరవాధ్యక్షుడిగా పి.వీరయ్యబాబు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.మనోజ్ కుమార్, గ్యారేజ్ అధ్యక్షుడిగా డీడీఎస్.రావు, కార్యదర్శిగా వి.జోషిబాబును ఎన్నుకున్నట్లు చెప్పారు. గుంటూరు జిల్లా కార్యదర్శిగా ఈపూరి విజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎండీ ప్రసాద్, సీనియర్ నాయకులు ఎం.హనుమంతరావు, కె.ఎస్.కరీముల్లా పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అత్యుత్సాహం

మంగళగిరి: పట్టణంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి(శివాలయం)లో గురువారం బీజేపీ నాయకులు హడావుడి చేశారు. శివాలయంలో గత కొద్ది రోజులుగా రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. గర్భగుడిలో పనులు జరుగుతుండడంతో శివుని విగ్రహం మీద దుమ్ము ధూళి పడకుండా అర్చకులు స్వామి వారు కనిపించకుండా ముసుగు వేశారు. ఇది తెలుసుకున్న బీజేపీ నాయకులు పనులు జరుగుతున్నాయనే ఆలోచన లేకుండా ఆలయానికి వచ్చి అర్చకులపై జులుం ప్రదర్శించారు. ప్రధాన అర్చకుడి దుర్భాషలాడుతూ ఉద్యోగం తీసేయిస్తామని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని బెదిరింపులకు దిగడంతో పాటు ఇన్‌చార్జి ఈఓ ఏ రామకోటిరెడ్డి చెప్పినా వినకుండా ఆందోళనకు దిగడం భక్తులతో నగర ప్రజలను విస్తుపోయేలా చేసింది. దీనిపై ఆలయ ఈఓ రామకోటిరెడ్డి మాట్లాడుతూ ఆలయంలో అభివృద్ధి పనులు జరుగుతున్న కారణంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు నిలిపివేయడం జరిగిందన్నారు. స్వామికి ఎక్కడా అపచారం జరగలేదని స్పష్టం చేశారు.